
సాక్షి
బాపట్ల
ఆదివారం । 7 । మే । 2023



నిమ్మకాయల ధరలు

తెనాలిటౌన్: తెనాలి మార్కెట్ యార్డులో శనివారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.3,000, గరిష్ట ధర రూ.5,800, మోడల్ ధర రూ.4,400 వరకు పలికింది.



వెండి శఠారు బహూకరణ

చేబ్రోలు: పొన్నూరులోని సహస్రలింగేశ్వరస్వామికి తెలంగాణ హైకోర్టు జడ్జి జస్టిస్ పెరుగు శ్రీసుధ కుమారుడు డాక్టర్ జ్యోతిర్విష్ణు భరద్వాజ స్వామికి వెండి శఠారు బహూకరించారు.

కరోనా @ జీరో

గుంటూరు మెడికల్: జిల్లా వ్యాప్తంగా శనివారం కరోనా పాజిటివ్ కేసులు ఒక్కటి కూడా నమోదు కాలేదు. జిల్లాలో ఎక్కడా మరణాలు సంభవించలేదు.



న్యూస్‌రీల్

బాపట్ల డీఎస్పీగా వెంకటేశ్వర్లు



బాపట్లటౌన్:బాపట్ల డీఎస్పీగా విధులు నిర్వర్తిస్తున్న ఎ.శ్రీనివాసరావును ఇటీవల ఆత్మకూరు బదిలీ చేశారు. అప్పటినుంచి ఖాళీగా ఉన్న బాపట్లకు ప్రస్తుతం సీఐడీ డీఎస్పీగా విధులు నిర్వర్తిస్తున్న టి.వెంకటేశ్వర్లును బాపట్ల డీఎస్పీగా బదిలీ చేస్తూ రేంజ్ కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి.

నృసింహుని సేవలో హైకోర్టు న్యాయమూర్తులు



వేదాద్రి(జగ్గయ్యపేట):ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట మండలం వేదాద్రిలోని యోగానంద లక్ష్మీ నరసింహస్వామిని ఏపీ, తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తులు శనివారం దర్శించుకున్నారు. ఉదయం ఏపీ హైకోర్టు న్యాయమూర్తి గోపాలకృష్ణ సతీసమేతంగా దర్శించుకున్నారు. వీరికి ఆలయ వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆయన స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి సుధ దర్శించుకున్నారు. న్యాయమూర్తులకు ఆలయ ఈవో కె.నాగరాజు స్వామివారి చిత్రపటాలు, ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ నాగరాజు, ఎస్సై దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అన్నమయ్య జయంతి ఉత్సవాలు ప్రారంభం

విజయవాడ కల్చరల్: అన్నమయ్య జయంతి సందర్భంగా అన్నమయ్య సంకీర్తన అకాడమీ (శ్వాస), కంచికామకోటి పీఠ శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో వారం రోజుల పాటు నిర్వహించే అన్నమయ్య జయంతి మహోత్సవాలు శనివారం లబ్బీపేట శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో వైభవంగా ప్రారంభమయ్యాయి. అన్నమయ్య కీర్తనలను గాయనీగాయకులు గానం చేశారు. పోపూరి శ్యామసుందర్, బుర్రా నీలకంఠశాస్త్రి, కస్తూరి గోపాలరావు, జీ అనూరాధ్, వైష్ణవి, మంజుల, వేమూరి విశ్వనాథ్ పాల్గొన్నారు. అన్నమయ్య జయంతి సందర్భంగా సంగీత విద్వాంసులు శోభాయాత్ర చేశారు. పున్నమ్మతోటలోని టీటీడీ కల్యాణ మండపం నుంచి అన్నమయ్య విగ్రహంతో ప్రారంభించి లబ్బీపేట వెంకటేశ్వర స్వామి విగ్రహం వరకు సాగింది.

వారధిపై ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు

తాడేపల్లిరూరల్: కనకదుర్గ వారధిపై తరచూ ట్రాఫిక్ నిలిచిపోయి ప్రజలు ఇబ్బంది పడకుండా చూసేందుకు రెండు జిల్లాల పోలీసులు సమన్వయంతో పనిచేయాలని నిర్ణయించారు. గుంటూరు, కృష్ణా జిల్లాల పోలీస్ ఉన్నతాధికారుల సమావేశం తాడేపల్లి బైపాస్ రోడ్‌లోని ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో శనివారం సాయంత్రం నిర్వహించారు. విజయవాడ సిటీ కమిషనర్ కాంతిరాణా టాటా, గుంటూరు జిల్లా ఎస్పీ ఆరిఫ్ హాఫీజ్‌లు హాజరయ్యారు. కనకదుర్గ వారధిపై ఏమైనా అవాంఛనీయ సంఘటనలు, ప్రమాదాలు జరిగినపుడు ఏవిధంగా వాటిని నివారిస్తున్నారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ఎంత సమయం పడుతుందనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. కనకదుర్గ వారధికి రెండువైపులా ఆగిపోయిన వాహనాలను తీసుకు వెళ్లేందుకు ట్రోలింగ్ వాహనాలు ఏర్పాటు చేయాలని, క్రేన్‌లను అందుబాటులో ఉంచాలని అభిప్రాయపడ్డారు. వారధిపై ఎటువంటి ప్రమాదం జరిగినా నిమిషాల వ్యవధిలో క్లియర్ చేసేవిధంగా రెండు జిల్లాల పోలీసులు పనిచేయాలని నిర్ణయించారు. వారధిపై రెండు గంటల పాటు రాకపోకలను పరిశీలించగా నిమిషానికి 60 నుంచి 70 వాహనాలు వారధివైపుగా వస్తున్నాయి. మూడు వరుసల్లో వచ్చిన వాహనాలు చివరకు రెండు వరుసల్లో వెళ్లాల్సి రావడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

అన్నదాతకు అండగా...

- తడిచిన పంటల కొనుగోలుకు శ్రీకారం
- మొక్కజొన్న, వరి ధాన్యం సేకరణకు సిద్ధమైన ప్రభుత్వం
- మార్క్‌ఫెడ్ ద్వారా మొక్కజొన్న, పౌరసరఫరాలశాఖ ద్వారా ధాన్యం సేకరణ
- మొక్కజొన్న కోసం 47 కేంద్రాలు, ధాన్యానికి 87 కేంద్రాలు
- మొదలైన రైతుల పేర్లు నమోదు ప్రక్రియ
- వర్షం తగ్గిన వెంటనే కొనుగోళ్లు



వర్షంతో దెబ్బతిన్న వేరుశనగ పంటను పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ శ్రీధర్

సాక్షి ప్రతినిధి, బాపట్ల : అర్హులకు అన్ని రకాల పథకాలను ఇంటి ముంగిటకు చేరుస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వర్షంతో తడిచిన పంటలను కొనుగోలు చేసి అన్నదాతలను ఆదుకునేందుకు సిద్ధమైంది. వారం రోజులుగా జిల్లాలో కురుస్తున్న వర్షాలకు మొక్కజొన్న, జొన్న, వేరుశెనగ పంటలు తడిచి ముద్దయ్యాయి. కోత దశలోనే 1000 హెక్టార్ల మొక్కజొన్న నీటి పాలైంది. 30 వేల మెట్రిక్ టన్నులకు పైగా మొక్కజొన్నలు, జొన్నలు, వరి ధాన్యం కల్లాలోనే నీట మునిగాయి. రేపల్లె, వేమూరు, అద్దంకి, పర్చూరు, బాపట్ల ప్రాంతాల్లో వర్షం ఎక్కువగా కురుస్తుంది. ఈ వర్షాలతో కల్లాల్లో తడిచిన పంటను ఆరబెట్టుకునే పరిస్థితి లేకుండా పోయింది. మొక్కజొన్నలు కొన్ని మొలకెత్తగా, మరికొన్ని బూజుపట్టి రంగు మారాయి. వర్షాలు మరో రెండు రోజులు కురిస్తే పంటలు పూర్తిగా దెబ్బతినే పరిస్థితి ఉంది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.



పంటల కొనుగోలుకు సిద్ధమైన ప్రభుత్వం

రైతుల ఆందోళనలను గుర్తించిన ప్రభుత్వం తడిచిన పంటలను కొనుగోలు చేసి అన్నదాతలకు అండగా నిలిచేందుకు సిద్ధమైంది. తక్షణమే మొక్కజొన్న, వరి ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించాలని అధికారులను ఆదేశించింది. కొనుగోళ్ల వ్యవహారాన్ని పర్యవేక్షించేందుకు రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ కాటంనేని భాస్కర్‌ను జిల్లా ప్రత్యేకాధికారిగా నియమించింది. శుక్రవారం సాయంత్రం బాపట్లకు చేరుకున్న ఆయన జిల్లా కలెక్టర్, జేసీ, ఇతర అధికారులతో సమావేశమయ్యారు. వర్షాల నేపథ్యంలో రైతుల పంటల కొనుగోళ్లపై మార్గనిర్దేశం చేశారు. రైతులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. దీంతో మొక్కజొన్న కొనుగోళ్లకు ఇప్పటికే సిద్ధమైన మార్క్‌ఫెడ్ అధికారులు పంటల అమ్మకాలకు సంబంధించి పేర్లు నమోదు చేసుకోవాలని రైతులకు సూచించారు. మొక్కజొన్న కొనుగోళ్ల కోసం జిల్లా వ్యాప్తంగా 45 కేంద్రాలు ఏర్పాటుచేశారు. వర్షం తగ్గుమొహం పట్టిన వెంటనే కొనుగోలు చేపట్టేందుకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. జిల్లాలో 10,771 మెట్రిక్ టన్నుల మొక్కజొన్నను కొనుగోలు చేయాలని అధికారులు ఆదేశించారు. ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది.

ధాన్యం కొనుగోలుకు శ్రీకారం

జిల్లాలో ఇప్పటికే ధాన్యం సేకరణ కొనసాగుతుంది. పౌరసరఫరాల విభాగం ధాన్యం కొనుగోలు చేస్తోంది. ఇందుకోసం జిల్లా వ్యాప్తంగా 87 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేశారు. రబీ సీజన్‌కు సంబంధించి ఏప్రిల్ 10 నుంచి ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. ఇప్పటివరకు 10,834 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించారు. ఇంకా 39 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయనున్నారు. కొనుగోలుకు సంబంధించి 600 మంది రైతులకు ఇప్పటివరకు రూ.6.51 కోట్లు చెల్లించారు. వర్షాల నేపథ్యంలో తడిచిన ధాన్యాన్ని కొంతమేర ఆరబెట్టిన వెంటనే కొనుగోలు చేయనున్నారు. ఏ ఒక్క రైతుకు నష్టం కలుగకుండా చూసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది.

రైతులు ఆందోళనకు గురి కావద్దు

వర్షాలతో తడిచి పంటలు దెబ్బతిన్న రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని జిల్లా జాయింట్ కలెక్టర్ శ్రీధర్ చెప్పారు. వర్షాలు అధికంగా కురిసిన రేపల్లె, నిజాంపట్నం మండలాల్లో జేసీ శనివారం అధికారులతో కలిసి పర్యటించారు. వర్షానికి తడిచిన వేరుశెనగ, మొక్కజొన్న, వరి పంటలను పరిశీలించారు. నష్టం వివరాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. రైతులు ఏ ఒక్కరూ ఆందోళన చెందవద్దని, ప్రభుత్వం అన్నిరకాలుగా అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. మొక్కజొన్న, వరి ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తోందన్నారు. వర్షం నష్టం వివరాలు ప్రాథమికంగా అంచనా వేశామని, వర్షం తగ్గిన వెంటనే క్షేత్రస్థాయిలో పరిశీలించి నష్టంపై పూర్తిస్థాయి అంచనాలతో ప్రభుత్వానికి నివేదిక అందిస్తామన్నారు. రానున్న రెండు రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. పంటలకు క్రాఫ్ ఇన్సూరెన్స్ వస్తుందన్నారు.

పదిలో మెరిసిన ప్రభుత్వ విద్యార్థులు

బాపట్లఅర్బన్ : పదో తరగతి పరీక్ష ఫలితాలలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు మెరిశారు. శనివారం ప్రభుత్వం విడుదల చేసిన పదో తరగతి పరీక్షా ఫలితాల్లో బాపట్ల జిల్లా 75.31 శాతం ఉత్తీర్ణత సాధించింది. జిల్లా వ్యాప్తంగా పదో తరగతి విద్యార్థులు 16,621 మంది పరీక్షలు రాయగా 12,517 మంది ఉత్తీర్ణత సాధించారు. బాలురు 8473 మంది హాజరుకాగా 6116 మంది ఉత్తీర్ణత సాధించారు. బాలికలు 8148 మందికి 6401మంది ఉత్తీర్ణులయ్యారు. బాలుర ఉత్తీర్ణత శాతం 72.18, బాలికల ఉత్తీర్ణత శాతం 78.56 సాధించారు.

జిల్లాలోనే ఉత్తమం చందలూరు జెడ్పీహెచ్ఎస్ పాఠశాల

జే పంగులూరు మండలం చందలూరు జెడ్పీహెచ్ఎస్ పాఠశాల జిల్లాలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచింది. ఈ పాఠశాలలో 125 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్ష రాశారు. వీరిలో 117మంది ఉత్తీర్ణత సాధించారు. 36మంది విద్యార్థులు 500మార్కులకుపైగా సాధించారు.

టాప్ లేపిన విద్యార్థులు

బాపట్ల జిల్లాలోని పలు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు టాప్–10 ర్యాంకులో నిలిచారు. వేటపాలెం మండలం పందిళ్లపల్లి జెడ్పీహెచ్ పాఠశాలకు చెందిన దంత విష్ణుప్రియ, జే పంగులూరు మండలం చందలూరు జెడ్పీహెచ్ఎస్ పాఠశాలకు చెందిన గొట్టిపాటి సృజన, రేపల్లె మండలం పేటేరు ఎస్పీ బీఎం జెడ్పీ హైస్కూల్‌కు చెందిన జక్కా యశ్వంత్‌కుమార్ ప్రతిభ కనబరిచారు. నగరం మండలం ఉల్లిపాలెం అల్లపర్రు జెడ్పీహెచ్ఎస్ పాఠశాలకు చెందిన పాటి వైష్ణవి, కొలగాని రిత్విక సత్తా చాటారు.

చీరాలలో..

చీరాల కస్తూరిబా గాంధీ మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థిని బి.భావన, ఈపూరుపాలెం జెడ్పీ బాలికోన్నత పాఠశాల విద్యార్థిని గాయత్రి, పట్టణంలోని విజ్ఞానభారతి హైస్కూల్ విద్యార్థిని కేశం బిందుశ్రీ ఉత్తమ మార్కులు సాధించారు.

పదిలో మెరిసిన ముత్యాలు

సాక్షి నెట్‌వర్క్: పది ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు దుమ్ము రేపారు. అద్దంకి నియోజకవర్గం సంతమాగులూరు మండలం ఏల్చూరు జెడ్పీహెచ్ఎస్ పాఠశాల విద్యార్థిని సీహెచ్ నవ్య లక్ష్మి, మక్కెన వారి పాలేనికి చెందిన షేక్ హసీనా ఉత్తమ ఫలితాలు సాధించారు. కొరిశపాడు మండలంలో జెడ్పీహెచ్ఎస్ విద్యార్థిని కే పూజిత శ్రీ, జే.పంగులూరు మండల గొట్టిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు సృజన ఉత్తమ ఫలితాలు సాధించారు. పర్చూరు నియోజకర్గం మార్టూరు మండలం వలపర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పోలిశెట్టి సుప్రజ మండలంలో ప్రథమ స్థానంలో నిలిచింది. చీరాల నియోజకవర్గం వేటపాలెం మండలం పందిళ్లపల్లి జెడ్పీ హైస్కూల్ దంతం విష్ణుప్రియ ఉత్తమ ఫలితాలు సాధించింది. ఉత్తమ ఫలితాలు సాధించడంలో ఆయా మండలాల ఎంఈవోలు హర్షం వ్యక్తం చేశారు.

వీడని వర్షం

కొరిటెపాడు(గుంటూరు):జిల్లాను వర్షం వీడడం లేదు. రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కోతలు పూర్తికాని మొక్కజొన్న, జొన్న చేలు ఈదురుగాలులు, భారీ వర్షానికి నేలవాలుతున్నాయి. ప్రస్తుత రబీ సీజన్‌లో జిల్లాలో దుగ్గిరాల, తెనాలి, చేబ్రోలు, కొల్లిపర, కాకుమాను, ప్రత్తిపాడు, పొన్నూరు, వట్టిచెరుకూరుమండలాల్లో 25,984 హెక్టార్లలో మొక్కజొన్న, 9,078 హెక్టార్లలో జొన్న సాగు చేశారు. వీటిలో సుమారు 55 శాతం పంట కోతలు పూర్తయ్యాయి. పలుచోట్ల పంట నూర్పిళ్లు చేస్తుండగా అకాల వర్షాలతో కల్లాల్లోని మొక్కజొన్న, జొన్న తడిచిపోవడంతో రైతులకు దిక్కుతోచని పరిస్థితి ఏర్పడింది.

ఎండ.. వాన దోబూచులాట...


వాతావరణంలో మార్పులు కారణంగా కొద్దిసేపు ఎండరావడంతో నూర్పిడి చేసిన మొక్కజొన్న, జొన్నలను రైతులు గట్టుకు చేర్చి ఎండబెట్టే ప్రయత్నం చేస్తున్నారు. కొద్దిసేపటికే ఒక్కసారిగా వర్షం పడడంతో ఎండబెట్టిన మొక్కజొన్న, జొన్న పంటను తడవకుండా జాగ్రత్తలు తీసుకోవడానికి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

కొల్లిపరలో 37.6 మిలీమీటర్ల వర్షం..

గుంటూరు జిల్లాలో శుక్రవారం ఉదయం నుంచి శనివారం ఉదయం వరకు అత్యధికంగా కొల్లిపర మండలంలో 37.6 మిల్లీ మీటర్లు వర్షం పడగా, అత్యల్పంగా దుగ్గిరాల మండలంలో 0.8 మి.మీ. వర్షం పడింది. సగటున 11.4 మి.మీ. వర్షపాతం నమోదైంది. వట్టిచెరుకూరు 29.8, ఫిరంగిపురం 22.8, కాకుమాను 20.2, తుళ్లూరు 16.2, గుంటూరు తూర్పు 10, మేడికొండూరు 9.4, పెదకాకాని 8.2, గుంటూరుపశ్చిమ 7.8, తాడేపల్లి 7.6, పొన్నూరు 5.4, తెనాలి 3.8, చేబ్రోలులో 2.2 మి.మీ చొప్పున వర్షం పడింది.

అవగాహనతో థలసీమియాకు చెక్

- రేపు ప్రపంచ థలసీమియా దినోత్సవం
- వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కల్గి ఉండాలి
- బాధితులకు ప్రభుత్వం రూ.10వేలు సాయం



గుంటూరుమెడికల్: థలసీమియా వ్యాధి సోకితే ప్రాణాలపై ఆశలు వదులుకోవటమే. మన దేశంలో 3.7 కోట్ల మందికి పైగా బాధితులు ఉన్నారు. తలసీమియా వ్యాధికి గురైన చిన్నారికి జీవితాంతం రక్తం ఎక్కిస్తూనే ఉండాలి. ఏ క్షణానైనా రక్తం ఎక్కించడం ఆపివేస్తే కొద్దిరోజుల్లోనే పిల్లవాడు చనిపోతాడు. వ్యాధిపై అవగాహన కలిగి ఉండటం ద్వా రా పుట్టబోయే పిల్లలు వ్యాధి బారిన పడకుండా కా పాడవచ్చు. ప్రజలకు అవగాహన కల్పించేందుకు సోమవారం ప్రపంచ థలసీమియా దినోత్సవం నిర్వహిస్తున్నారు. 'సాక్షి'అందిస్తున్న ప్రత్యేక కథనం.

జిల్లాలో 42 మంది బాధితులు

థలసీమియాతో ప్రతి ఏడాదీ వేలాదిమంది పిల్లలు జన్మిస్తున్నట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. గుంటూరు జిల్లాలో ప్రతినెలా ఏడుగురు చిన్నారులు థలసీమియా వ్యాధి సోకి చికిత్స కోసం జీజీహెచ్‌కు వస్తున్నట్లు వైద్య నిపుణులు తెలిపారు. ప్రస్తుతం గుంటూరు జీజీహెచ్‌లో 40 మంది చిన్నారులు చికిత్స పొందుతున్నారు. చిన్నపిల్లల వైద్య విభాగంలో ప్రతిరోజూ బాధితులకు ఉచితంగా వైద్యం అందిస్తున్నారు. బాధితులకు క్రమం తప్పకుండా రక్తం కూడా ఉచితంగా ఎక్కిస్తున్నారు. ప్రతి శుక్రవారం ప్రత్యేకంగా థలసీమియా బాధితులకు పిల్లల వైద్య విభాగంలో ఓపీ వైద్య సేవలు అందిస్తున్నారు.

వ్యాధిరావడానికి కారణాలు

థలసీమియా వ్యాధి జన్యుపరమైనది. ఎముక మూలుగలో హిమోగ్లోబిన్ ఉండే రక్తకణాల ఉత్పత్తి నిలిచిపోవటాన్ని థలసీమియా వ్యాధి అంటారు. ఇది తల్లిదండ్రుల ద్వారా పిల్లలకు సోకుతుంది. థలసీమియా సోకిన వారికి జీవితాంతం రక్తం ఎక్కించాల్సి ఉంటుంది. మనం పీల్చే ప్రాణవాయువు(ఆక్సిజన్)ను రక్తం ద్వారా శరీరంలోని అన్ని భాగాలకు అందించేది హిమోగ్లోబినే. తలసీమియా రోగుల్లో శరీరానికి సరిపడ హిమోగ్లోబిన్ ఉత్పత్తి కాదు. ఒక వేళ తయారైనా ఎక్కువ కాలం హిమోగ్లోబిన్ ఉండదు. హిమోగ్లోబిన్ నిల్వలు తగ్గిన ప్రతిసారి కృత్రిమంగా రక్తం ద్వారా హిమోగ్లోబిన్‌ను అందించాలి. సకాలంలో అందించకపోతే ప్రాణాలు పోతాయి.

వ్యాధి లక్షణాలు

పుట్టిన బిడ్డ మూడు నెలల వయస్సు నుంచి 18 నెలల వయస్సులోపే ఈ వ్యాధి బయట పడుతుంది. ముఖం పీక్కుపోవటం, బాల్యంలోనే ముడతలు పడినట్టుగా తయారవుతుంది. శరీర రంగు తేడాగా ఉండి పాలిపోయినట్టుగా మారుతుంది. శారీరక ఎదుగుదల ఉండదు. బొడ్డు భాగంలో వాపు ఉంటుంది. తరచూ అనారోగ్యానికి గురవుతారు. బాధితుల్లో అడుగేస్తే ఆయాసం, తీవ్రస్థాయిలో నీరసం, జీర్ణశక్తి మందగించడం, పొట్ట లావు ఎక్కడం, ఎముకల్లో పటుత్వం తగ్గడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఐరన్ తక్కువగా ఉండాలి. కానీ శరీరంలోకి రక్తం ఎక్కించే సమయంలో ప్రవేశించే ఐరన్ ఓకేచోట కుప్పలాగా పోగుబడి మూత్ర పిండాలు, కాలేయం, గుండె సమస్యలు తలెత్తుతాయి.

బాధితులకు రూ.10వేలు ఆర్థిక సాయం

డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా పని చేసిన సమయంలో థలసీమియా వ్యాధిని ఆరోగ్యశ్రీ పథకంలో చేర్చారు. ఆయన తనయుడు ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి థలసీమియా బాధితుల సమస్యలను నివారించేందుకు వారికి కొండంత అండగా నిలబడ్డారు. ప్రతినెలా బాధితులకు రూ.10వేలు ఆర్థిక సాయం పెన్షన్ రూపంలో అందిస్తున్నారు. బాధితులకు అవసరమయ్యే వైద్య సేవలన్నీ డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ప్రభుత్వం ఉచితంగా అందిస్తోంది. గుంటూరు జీజీహెచ్‌లో ప్రతి శుక్రవారం థలసీమియా బాధితులకు ప్రత్యేక ఓపీ విభాగాన్ని ఏర్పాటుచేసి ఉచితంగా మందులు అందిస్తున్నారు.

ఉచితంగా వైద్య సేవలు



జిల్లా వ్యాప్తంగా ఉన్న థలసీమియా బాధితులకు ప్రభుత్వం అండగా ఉండి, ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగా వైద్య సేవలు అందించడంతోపాటు మందులు కూడా అందిస్తోంది. జిల్లా వ్యాప్తంగా 142 మంది తలసీమియా బాధితులు ఉండగా, వీరిలో 83 మంది బాలురు, 59 మంది బాలికలు ఉన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి థలసీమియా చిన్నారులకు రూ.10వేలు పెన్షన్ అందించి వారికి ఆరోగ్యపరంగా పూర్తి భరోసా కల్పిస్తున్నారు. గుంటూరు జీజీహెచ్‌లోని డైక్ సెంటర్ ద్వారా థలసీమియా బాధితులకు కావాల్సిన అన్ని వైద్య సేవలను అందిస్తున్నాం.

– డీఎంహెచ్ఓ డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు

ముందస్తుగా గుర్తించవచ్చు....



గుంటూరు జీజీహెచ్‌లో థలసీమియా వ్యాధి బాధితులకు ఉచితంగా ప్రతిరోజూ వైద్య సేవలందిస్తున్నాం. వ్యాధిని పసిగుడ్డు గర్భంలో ఉన్న సమయంలో వ్యాధి నిర్ధారణ చేసి గుర్తించవచ్చు. పెళ్లికి ముందే వధూవరులకు కంప్లీట్ బ్లడ్ కౌంట్ సీబీసీ, హెచ్‌బీఏ 2 లెవల్ పరీక్షలు చేయించాలి. థలసీమియా వ్యాధి కుటుంబాలకు జన్యుపరమైన పరీక్షలు చేయాలి. వ్యాధి పట్ల ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించడం ద్వారా వ్యాధి బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకునే అవకాశం కలుగుతుంది.

– డాక్టర్ పి.పద్మలత, పిల్లల వైద్య విభాగాధిపతి, గుంటూరు జీజీహెచ్

పేదల ద్రోహి చంద్రబాబు

- హైకోర్టు తీర్పు చంద్రబాబుకు, అయన వర్గానికి చెంపపెట్టు
- ఎమ్మెల్సీ సునీత ధ్వజం



సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్సీ సునీత

చీరాల: పేద, బడుగు బలహీనవర్గాల ద్రోహి చంద్రబాబు నాయుడే.. హైకోర్టు తీర్పు టీడీపీకి చెంపపెట్టని ఎమ్మెల్సీ, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు పోతుల సునీత ధ్వజమెత్తారు. అమరావతిలో పేదలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేసేలా కోర్టు తీర్పు ఇవ్వడంతో శనివారం ఆమె తన నివాసంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. సీఎం జగన్ అమరావతిలో కూడా పేదలు బడుగు, బలహీనవర్గాలు ఉన్నత వర్గంలోని పేదలు నివాసం ఉండే విధంగా 50 వేల మందికి నివేశన స్థలంతో పక్కా గృహాలు కట్టేందుకు నాలుగేళ్ల కిందట ప్రయత్నం చేసిందని చెప్పారు. కానీ ఇది జీర్ణించుకోలేని చంద్రబాబు, ఆయన వర్గం అమరావతిలో పేదలు ఉండేందుకు వీల్లేదని రైతుల ముసుగులో ఉన్న కొందరి చేత కోర్టులో పిటిషన్ వేసి అడ్డుకున్నారన్నారు. చివరకు కోర్టు 50 వేల మంది పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు అనుకూలంగా తీర్పు ఇవ్వడంతో చంద్రబాబుకు మతి పోయిందన్నారు. అదే నాలుగేళ్ల కిందట ఇళ్ల స్థలాల ప్రక్రియ పూర్తయి ఉంటే పేదలు తమ సొంత ఇంట్లో నివాసాలు ఉండేవారన్నారు.

అమరావతిలో బాబు వర్గం దోపిడీ..

అమరావతిలో చంద్రబాబు తన బినామీలు వేల ఎకరాలు కొనుగోలు చేసి కోట్లాది రూపాయలు సంపాదించారని ఆరోపించారు. సింగపూర్, మలేషియా అంటూ అమరావతిని భ్రమరావతిగా మార్చి ఇన్‌సైడర్ ట్రేడింగ్ ద్వారా కోట్లాది రూపాయలు సంపాదించి విదేశాల్లో డబ్బు దాచుకున్న ఘనత చంద్రబాబుదని ఎద్దేవా చేశారు. చంద్రబాబు రాజకీయాల్లోకి వచ్చిన తరువాత సొంతంగా పోటీ చేసి ప్రజల అభిమానాన్ని పొంది గెలిచిన దాఖలాలు లేవన్నారు. ప్రతిసారి ఏదో ఒక పార్టీతో పొత్తు పెట్టుకొని గెలిసే ప్రయత్నం చేస్తారే గాని ప్రజల అభిమానం పొందలేదని విమర్శించారు. చంద్రబాబుకు వత్తాసు పలుకుతున్న పవన్‌కళ్యాణ్‌కి పచ్చ మీడియాకు ప్రజలే బుద్ధి చెప్తారన్నారు. 2024లో ప్రజలంతా కలసి 2019 మాదిరిగానే తండ్రీకొడుకులకు బుద్ధి చెప్పాలన్నారు. లోకేష్‌ది పాదయాత్ర కాదని కామెడీ యాత్రని ఎద్దేవా చేశారు. అను నిత్యం పేదవర్గాల కోసం ఆలోచించి నాలుగేళ్లలో మూడు లక్షల కోట్లు పేదలకు పారదర్శంగా ఖర్చు పెట్టిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌దే అన్నారు. విద్యా, వైద్యంలో విప్లవాత్మక మార్పులు తెచ్చి మార్పు ఘనత ఆయనదే అన్నారు. చంద్రబాబు ఎన్నికుత్రలు, కుతంత్రాలు పన్నినా ప్రజలు తెలుసుకొని మళ్లీ 2024లో జగన్‌ను ముఖ్యమంత్రిని చేయాలని ఆమె కోరారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ మల్లిల బుల్లిబాబు, పోతుల ప్రకాశ్, పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం శనివారం 522.00 అడుగుల వద్ద ఉంది. ఇది 152.9470 టీఎంసీలకు సమానంగా ఉంది. సాగర్ జలాశయం నుంచి ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి 27,193, ఎస్ఎల్‌బీసీకి 900 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. దీంతో సాగర్ జలాశయం నుంచి మొత్తం ఔట్‌ఫ్లోగా 28,095 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం నుంచి సాగర్ జలాశయానికి 28,095 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 807.70 అడుగుల వద్ద ఉంది. ఇది 32.9712 టీఎంసీలకు సమానం.

క్లుప్తంగా

విద్యుత్ బకాయిలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

ఏపీసీపీడీసీఎల్ ఫైనాన్స్ డైరెక్టర్ శ్రీనివాసులు

అద్దంకి రూరల్: డివిజన్ పరిధిలోని విద్యుత్ బకాయిల వసూలుపై దృష్టి పెట్టాలని ఏపీసీపీడీసీఎల్ ఫైనాన్స్ డైరెక్టర్ వి.శ్రీనివాసులు పేర్కొన్నారు. స్థానిక విద్యుత్ భవన్‌లో బకాయిల వసూలుపై అధికారులతో సమీక్ష సమావేశం శనివారం నిర్వహించారు. ఫైనాన్స్ డైరెక్టర్ మాట్లాడుతూ డివిజన్ పరిధిలో సుమారు రూ.5 కోట్ల బకాయిలు ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఈ కేవీజీ సత్యనారాయణ, ఈఈ ఎస్ మస్తాన్‌రావు, సీనియర్ అకౌంటెంట్ కె. సుబ్బారావు పాల్గొన్నారు.

వాహన చోదకులు నిబంధనలు పాటించాలి



రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న పోలీసులు

బాపట్ల టౌన్: పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించి ప్రయాణాలు చేస్తే ప్రమాదాలు తప్పవని జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్ తెలిపారు. నో యాక్సిడెంట్ డే కార్యక్రమంలో భాగంగా శనివారం జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్ పరిధిలో రోడ్డు ప్రమాదాలపై ప్రజలు, ప్రయాణికులు, వాహన చోదకులకు అవగాహన కల్పించారు. ఇటీవల రోడ్డు ప్రమాదాలు జరిగిన ప్రదేశాలను పోలీస్ అధికారులు సందర్శించి ఆ ప్రదేశాల్లో రోడ్డు ప్రమాదాలు జరుగకుండా వాహనాల వేగాలను నివారణకు చర్యలు తీసుకున్నారు.

మొక్కజొన్న రైతుల్ని ఆదుకుంటాం

మంత్రి మేరుగ నాగార్జున

బలిజేపల్లి(వేమూరు): అకాల వర్షాల వల్ల నష్టపోయిన మొక్కజొన్న రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున పేర్కొన్నారు. వేమూరు మండలంలోని బలిజేపల్లిలో దెబ్బతిన్న మొక్కజొన్న పంటను శనివారం పరిశీలించారు. మంత్రి మాట్లాడుతూ దెబ్బతిన్న మొక్కజొన్న పంటలను పరిశీలించి, అంచనాలు తయారు చేయాలని ఇప్పటికే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వ్యవసాయాధికారులను ఆదేశించినట్లు చెప్పారు. మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రైతులు అధైర్య పడకుండా మొక్కజొన్న పంటను కాపాడుకోవాలని సూచించారు. వేమూరు నియోజకవర్గంలోని చుండూరు, వేమూరు, అమృతలూరు, కొల్లూరు, భట్టిప్రోలు మండలాల్లో మొక్కజొన్న పంటలు దెబ్బతిన్నాయని, వ్యవసాయాధికారులు ప్రతి రైతు వద్దకు వెళ్లి నష్టం అంచనా వేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ బొల్లిముంత ఏడుకొండలు, ఎంపీపీ రావర్ల నరేంద్ర, రైతులు రాయపూడి సాంబశివరావు, పులివర్తి రంగరావు, యర్రవరపు వెంకటేశ్వరరావు, వేజండ్ల మల్లికార్జునరావు, రాయపూడి శ్రీనివాసరావు, కస్తూరి సాంబశివరావు, రైతులు పాల్గొన్నారు.



బలిజేపల్లిలో మొక్కజొన్న పంట పరిశీలిస్తున్న మంత్రి నాగార్జున

నకిలీ రిజిస్ట్రేషన్ల కేసులో నిందితులు అరెస్టు

కొల్లూరు: నకిలీ పత్రాలు సృష్టించి దొంగ రిజిస్ట్రేషన్ పత్రాలతో విక్రయాలు చేసి నిందితులను పోలీసులు శనివారం అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు.. మండలంలోని పెసర్లంకకు చెందిన వెలివల శివ డాక్టర్‌బాబు, తన బంధువులు అన్నంనేని ముత్తయ్య, అన్నంనేని నాంచరయ్యలకు చెందిన భూమిని నకిలీ పత్రాలతో దొంగ రిజిస్ట్రేషన్లు చేయించి విక్రయాలకు పాల్పడ్డాడు. కొల్లూరుకు చెందిన వాగోలు మదన్‌కుమార్, కొండేటి శ్రీనివాసరావు ఆధార్ కార్డులలో అన్నంనేని ముత్తయ్య, అన్నంనేని నాంచారయ్య పేర్లతో మార్పులు చేయించడంతో పాటు, ఫొటోలు మార్పించి దొంగ రిజిస్ట్రేషన్ల ప్రక్రియకు తెరతీశాడు. 2009లోనే నాంచారయ్య మృతి చెందగా అతను బతికే ఉన్నట్లు ఆధార్ కార్డుల ద్వారా నమ్మించి వేర్వేరు సర్వే నంబర్లలోని కొల్లూరు, పెసర్లంక ప్రాంతాలలో ఉన్న 6.23 ఎకరాల భూమిని మదన్‌కుమార్, శ్రీనివాసరావు పేరుతో 2019లో దుగ్గిరాల, తెనాలి, అమృతలూరు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలలో రిజిస్ట్రేషన్లు చేయించాడు. అనంతరం 5.17 ఎకరాల భూమిని తెనాలికి చెందిన కొందరికి రూ.42 లక్షలకు విక్రయించాడు. మరో 1.06 ఎకరాల భూమిని శివడాక్టర్‌బాబు తన పేరుపై ఉంచుకున్నాడు. తమ భూములు విక్రయాలకు గురయ్యాయని తెలుసుకున్న శివడాక్టర్‌బాబుకు వరసకు సోదరుడు అయ్యే సాతా శివప్రసాద్ భూములు తనకు వర్తించేలా తమ తాతలు వీలునామ రాశారని, శివడాక్టర్‌బాబు దొంగ రిజిస్ట్రేషన్లతో భూములు రిజిస్ట్రేషన్లు చేయించినట్లు 2022లో కొల్లూరు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసిన ఎస్ఐ శామ్యూల్‌రాజీవ్‌కుమార్ రిజిస్ట్రేషన్లకు సంబంధించిన ఆధారాలు సేకరించి నిందితులు ముగ్గురిని శనివారం అరెస్టు చేసి తెనాలి కోర్టుకు హాజరుపరచగా నిందితులకు న్యాయమూర్తి రిమాండ్ విధించారు. దొంగ రిజిస్ట్రేషన్ల అంశంపై మరికొంత విచారణ జరిపి మరికొంత మంది వ్యక్తులపై కేసు నమోదు చేయనున్నట్లు ఏఎస్ఐ బాబూరావు తెలిపారు.

ముమ్మరంగా పేదల ఇళ్ల స్థలాల లేఅవుట్ పనులు

మంగళగిరి: సీఆర్‌డీఏ పరిధిలో పేదలకు కేటాయించిన ఇళ్ల స్థలాల్లో లేఅవుట్ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. కృష్ణాయపాలెం, యర్రబాలెం, నవులూరు, నిడమర్రు పరిధిలలో సుమారు 20 వేల మంది పేదలకు ఇళ్ల పట్టాలు అందజేసేందుకు సీఆర్‌డీఏ సన్నాహాలు చేస్తోంది. ఇళ్ల స్థలాల కోసం కేటాయించిన భూముల్లో ఇప్పటికే పొదలు తొలగింపు, చదును పనులు పూర్తి చేస్తున్నారు. శనివారం కృష్ణాయపాలెం వద్ద పేదలకు కేటాయించిన ఇళ్ల స్థలాల్లో హద్దు రాళ్ల పాతే ప్రక్రియను చేపట్టారు. మరి కొద్ది రోజుల్లో ఇళ్ల పట్టాల పంపిణీకి ప్రభుత్వం సిద్ధం అవుతుండగా లబ్ధిదారుల పేరుతో పట్టాలు తయారు చేసే పనిలో నిమగ్నమయ్యారు. మరో వారం రోజుల్లో సీఆర్‌డీఏ పరిధిలో కేటాయించిన భూముల్లో ఇళ్ల స్థలాలకు హద్దురాళ్ల పాతి ప్లాట్ నంబర్లు కేటాయించేలా చర్యలు తీసుకుంటుండటంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మిరప కల్లాల్లో జాగ్రత్తలు అవసరం

గుంటూరు ఏపీఎంఐపీ ప్రాజెక్టు అధికారి హరినాథ్‌రెడ్డి

చినగంజాం: కల్లాల్లో ఉన్న మిరప కాయలను జాగ్రత్తగా కాపాడుకోవాలని గుంటూరు ఏపీఎంఐపీ ప్రాజెక్టు అధికారి సీబీ హరినాథ్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన ఇంకొల్లు మండలంలోని పూసపాడు, దగ్గుబాడు గ్రామాల్లోని మిరప పంటలను పరిశీలించి రైతులకు సూచనలిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు మిరప కల్లాల్లోని కాయలు తడవకుండా టార్పాలిన్ పట్టలతో కప్పుకోవాలని చెప్పారు. ఎండిన వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించారు. వర్షాలు తగ్గిన తరువాత మాంకోజెబ్, బావిస్టిన్ కలిపిన మందును 2.5 గ్రాములు ఒక లీటరు నీటికి కలిపి ఎకరాకు పావు కిలో పిచికారీ చేసుకోవాలని చెప్పారు. వర్షాలు తగ్గిన తరువాత కోత కోసి, ఎండబెట్టేటప్పుడు కాయకుళ్లు ఆశించిన కాయలను వేరు చేసి విడివిడిగా ఎండబెట్టు కోవాలని వివరించారు. కార్యక్రమంలో ప్రకాశం జిల్లా ఏపీఎంఐపీ పీడీ బీ రవీంద్రబాబు, బాపట్ల పీడీ బీవీ రమణ, పర్చూరు, చీరాల ఉద్యాన శాఖాధికారులు డీ రవిప్రకాష్‌బాబు, పీ అలేఖ్య పాల్గొన్నారు.



రైతులకు సూచనలిస్తున్న ప్రాజెక్ట్ అధికారి హరినాథ్‌రెడ్డి

కుమార్తె పరీక్ష ఫలితాలు చూడకుండానే ఆగిన గుండె

- గుండెపోటుతో జగ్గడిగుంటపాలెం పంచాయతీ కార్యదర్శి హఠాన్మరణం
- నివాళులర్పించిన తెనాలి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్

కొల్లూరు: కన్న కూతురి పదో తరగతి పరీక్ష ఫలితాలు తెలుసుకోవాలని ఉత్సుకతతో ఎదురు చూస్తున్న తండ్రి విడుదలకు ముందే హఠాన్మరణానికి గురికావడంతో ఆ కుటుంబంతో పాటు, స్థానికంగా విషాదం ఛాయలు నెలకొన్నాయి. కొల్లూరుకు చెందిన అబ్బూరి మారుతీ వర ప్రసాద్(45) గుంటూరు జిల్లా తెనాలి మండలం జగ్గడిగుంటపాలెం పంచాయతీ కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. శనివారం రెండో కుమార్తె టెన్త్ పరీక్ష ఫలితాల కోసం ఎదురు చూస్తున్నాడు. భార్య, కుమార్తె కృష్ణాజిల్లాలోని బంధువుల ఇంటికి వెళ్లడంతో కొల్లూరు పంచాయతీ కార్యాలయంలో సహచరుల వద్ద కొంత సేపు గడిపేందుకు వెళ్లారు. అక్కడ గంటపాటు గడిపిన అనంతరం ఫలితాలు వెలువడే సమయం కావడంతో కారులో ఇంటికి తిరిగి వెళ్లారు. కారులో ప్రయాణిస్తున్న సమయంలోనే కృష్ణాజిల్లాలో ఉన్న భార్యతో ఫోన్‌లో మాట్లాడారు. తనకు కొంచెం నీరసంగా ఉందని, పరీక్ష ఫలితాలు తెలుసుకున్న అనంతరం విధులకు వెళతానని తెలిపారు. కొల్లూరు గాయత్రీ నగర్‌లోని ఇంటికి చేరుకున్న ఆయన కారును ఇంటిలో నిలిపి ఇంజన్ ఆపకుండానే లోపలకు వెళ్లి సోఫాలో కూలబడిపోయాడు. ఆరోగ్యం సరిగా లేదని భర్త తెలపడంతో ఆందోళనకు గురైన భార్య కోమలి ఫోన్ చేసినా సమాధానం లేకపోవడంతో కంగారు పడి పక్కింటి మహిళకు ఫోన్ చేసి ఇంట్లో చూడాలని కోరింది. ఇంటికి వచ్చిన ఆమె సోఫాలో కూర్చుని ఉన్న ప్రసాద్‌ను పిలిచినా సమాధానం లేకపోవడంతో దగ్గరకు వెళ్లి పలుమార్లు తట్టి లేపేందుకు ప్రయత్నించినప్పటికీ ఉలుకు, పలుకు లేకపోవడంతో అతని భార్యకు ఫోన్ చేసి పరిస్థితి వివరించింది. కొల్లూరులో ఉండే బంధువులకు మృతుడు భార్య ఫోన్ చేయడంతో వెంటనే వైద్యుని తీసుకువెళ్లి పరీక్షలు చేసినప్పటికీ ప్రయోజనం లేకపోయింది. గుండెపోటుతో మృతి చెందినట్లు వైద్యుడు నిర్ధారించారు. పంచాయతీ కార్యదర్శి ప్రసాద్ మృతదేహం వద్ద భార్య, కుమార్తె, బంధువుల రోదనలతో ఆ ప్రాంతంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. భౌతికకాయాన్ని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ సందర్శించి నివాళులర్పించారు.



పంచాయతీ కార్యదర్శి మారుతీ వరప్రసాద్ మృతదేహం వద్ద రోదిస్తున్న బంధువులు